# అపరిశుభ్రం

వై. వి. యస్. యస్.యన్ మూర్తి

"దక్షిణాఫ్రికా లో గాంధీ!" అనే పాఠం సారాంశం ముందుగా తెలుగులో చెప్తున్న ఇంగ్లీషు మాష్టరు రంగనాథం క్లాసులోని కలకలానికి పాఠం మధ్యలో నిలిపి "ఏమిటి కారణం?" అన్నట్లు కోపంగా విద్యార్థుల వంక చూశాడు. విద్యార్థినుల వరుసలో ఆఖరు బెంచీ నుండి బేబీ అనే అమ్మాయి "సార్! మురికివాసన సార్:" అంటూ ముక్కు మూసుకొంటూ బెంచీకి దూరంగా నిలబడి రిపోర్టు చేసింది.

"మురికివాసనా! ఎక్కడ?" అన్నాడు రంగనాథం.

"ఇదోసార్! సీతాలు దగ్గర! అది స్నానంచేసి గుడ్డలు మార్చి ఎన్నిరోజులయిందో! దాని దగ్గర ఒకటే వాసన సార్!" అని పుస్తకాల సంచి తీసుకొని దూరంగా వచ్చేసింది. ఆమె వెనుక ఆ బెంచీలో కూర్చున్న మరో యిద్దరు అమ్మాయిలు లేచి వచ్చేశారు. అంతే కాకుండా ముందు బెంచీలో కూర్చున్న అమ్మాయిలు కూడా ఆ మురికి వాసన భరించలేమన్నట్లు బెంచీ ఖాళీ చేసేశారు. ఇదంతా చూస్తుంటే రంగనాథానికి చెప్పలేనంత కోపంవచ్చింది. ముఖ్యంగా ఈ గొడవ వలన పాఠం ఆగిపోయినందుకు ఆయనకు మరీ కోపంగా వుంది. ఈ రకంగా అల్లరి చేస్తున్నందుకు, బేబీని, మిగిలిన అమ్మాయిలను తిట్టాలనుకున్నాడు. వాళ్ళని చూశాక, వాళ్ళంతా ఊరులో బాగా పలుకుబడి ఉన్న పెద్దల సంతానంగా తెలుసుకొని, వాళ్ళను ఏమీ అనలేక, ఈ గొడవకు మూలకారణం సీతాలు కాబట్టి తన కోపం అంతా అటు మళ్ళించాడు రంగనాథం.

"ఏయ్ సీతాలూ ఇలారా!" అని కోపంగా పిలిచాడు రంగనాథం. సీతాలు సిగ్గుతో, బాధతో, దుఃఖంతో ముడుచుకుపోయి తల వంచుకొని పుస్తకాలు తీసుకొని రంగనాథం దగ్గరకు వెళ్ళింది.

"అబ్బా!వాసన! దూరం." అని రంగనాథం జేబురుమాలుతో ముక్కు మూసుకున్నాడు. ఒక నిముషం తరువాత "నీకు ఎన్నిసార్లు చెప్పాలి! రోజూ స్నానం చేసి, మంచి గుడ్డలు కట్టుకొని రావాలని. ఏమిటా చింపిరి జుత్తు? ఫేషన్ చేస్తున్నావా? ఇంత మురికిగా ఉంటే ఎవరూ నిన్ను దగ్గరకు రానివ్వరు తెల్సా! నీ ప్రక్కన ఎవరూ కూర్చోరు. ఊఁ వెళ్ళి శుభ్రమైన గుడ్డలు కట్టుకొని రా!" అన్నాడు రంగనాథం.

"మాష్టారూ! నేను రోజూ స్నానం చేసాను మాష్టారూ! రోజూ ఉతికిన గుడ్డలే కట్టుకుంటాను సార్! పని తెమలక ఈ వేళ తల దువ్వుకోలేదు. రేపటి నుండి తల దువ్వుకొని వస్తాను సార్!" అంది సీతాలు ఏడుస్తూ!

"రోజూ చూస్తున్నాను ఇలాంటి

మురికి గుడ్డలే కట్టుకొని వస్తున్నావ్! పైగా అబద్ధం కూడానా!" అన్నాడు రంగనాథం.

"సత్య ప్రమాణంగా ఉతికిన బట్టలే సార్! రోజూ సాయంకాలం ఉతుక్కుంటాను సార్! ఇవి తప్ప వేరే బట్టలు నాకు లేవుసార్!" అంది సీతాలు సిగ్గుతో తల వంచుకొని. సీతాలు మాటలు విని ఒక్కసారిగా కాసు అంతా గొల్లుమంది.

"సైలెన్స్! సైలెన్స్!" అంటూ రంగనాథం గొంతు అరిచింది. "అంత కష్టపడి ఈ చదువెందుకు? వేరే పని చూసుకోక. వెళ్ళు! వెళ్ళి, శుభ్రమైన బట్టలు కట్టుకుంటేనే రేపటి నుండి కాసుకురా! లేకపోతే రావద్దు. వెళ్ళ నాటైం వేస్టు," అన్నాడు రంగనాథం బిగ్గరగా కేకలు వేస్తూ. ఉబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ క్లాసునుండి బయటకు నడిచింది సీతాలు. సీతాలు బయటకు వెళ్ళిపోయాక "అమ్మాయిలూ! మీ మీ స్థానాల్లో కూర్చోండి." అన్నాడు రంగనాథం.

"అమ్మా! పీడ వదిలింది. ఇక ఈ బెంచీని ఫినాయిల్ వేసి కడిగితే తప్ప ఆ మురికి పోదు." అంటూ బేబీ ముందు బెంచీలో సర్దుకుంది. మిగిలిన అమ్మాయిలూ ఆ ముందున్న బెంచీల్లో సర్దుకున్నారు. ఎవరూ చివరి బెంచీలో కూర్చోలేదు. ఖాళీగా వున్న బెంచీని చూసి "అవును మురికిగా ఉన్న ఆ బెంచీలో ఆ పిల్లలు ఎలా కూర్చుంటారు?" అనుకొని, రంగనాథం పాఠం మొదలు పెట్టాడు.

క్లాసులో నుండి బయటకు వచ్చిన సీతాలుకు ఏమీ చేయడానికీ తోచలేదు. దుఃఖంతో కుమిలిపోతూ తోటలోకి వెళ్ళి ఒక చెట్టుక్రింద కూర్చుంది. కళ్ళు వొత్తుకుంది. "వాళ్ళంతా హేళన చేస్తున్నంత మురిగ్గా ఉందా తను? తను రోజూ స్నానం చేస్తూనే ఉంది. తనను మురికి అన్నవాళ్ళే చాలా సార్లు గొప్పగా" ఈ వేళ పరమ బోర్‌గా ఉండే స్నానం చెయ్యలేదోయ్!" అని చెప్పుకోవడం చాలా సార్లు వింది తను. అవును వాళ్ళు ఏం చేసినా గొప్పగానే ఉంటుంది. ఆ బేబీ జుత్తు ఎప్పుడూ చీకేసిన తాటి టెంకలా ఉన్నా! 'అందమైన తలకట్టు' అని పొగుడుతారు అంతా. అసలీ గొడవ అంతా ఆ బేబీ వల్లనే వచ్చింది. దాని మాటే అందరికీ వేదవాక్కు. పెద్ద ధనవంతుల బిడ్డకదా! అందరికీ అదంటే మోజు. రోజూ కారులో వస్తుంది. రకరకాల బట్టలు ఖరీదైనవి వేసుకొని ఫేషనుగా అలంకరించుకుంటుంది. పైగా బాగా చదువుతుంది. దానికంటే నాకు ఎక్కువ మార్కులురావడం అదిసహించ లేక అలాచేస్తుంది. అదేమంటే అందరూ అదే అంటారు. ఈవేళే కాదు ఇలాఎన్ని సార్లుతననిఅదిఅవమానించలేదు. ఒకసారి బొంబాయి నుండి వాళ్ళ బాబాయి ఏదో కొత్తరకం పెన్ను తెచ్చాడని అందరికీ చూపించింది. ఆ పెన్ను ఎంతో బాగుంది. ఆ పెన్ను చూడాలని తనకీ అనిపించి తనూ ఒక్కసారి చూస్తానని అడిగింది.

"ఏమిటీ! పెన్ను చూస్తావా? నీ మడి చేతులో పట్టుకుంటే మకిలి దేరిపోదా? అంది పెన్ను దాచేస్తూ. ఇలా ఎన్నో సార్లు అది తనని అవమానిం

చింది. ఈ స్కూల్లో అది ఆడింది ఆట, పాడింది పాట. మాష్టారయినా దాన్ని మందలించక క్లాసులో తననే అవమానించారు. తను శుభ్రంగా లేదట. అందుకే తనకు దగ్గరగా ఎవరూ రారట. "శుభ్రమైన గుడ్డలు కట్టుకోకపోతే క్లాసుకు రావద్దు" అన్నారు మాష్టారు. తనకు ఖరీదయిన బట్టలు ఎక్కడనుండి వస్తాయి? తన తండ్రి రోజువారీ కూలి పని చేస్తాడు. తల్లేమో నాలుగైదు ఇళ్ళల్లో పాచిపని చేస్తుంది. తను. చదువులో చురుగ్గా ఉండడం చూసి అన్నలు తనను చదువులో పెట్టారు. వాళ్లు పట్నంలో ఏదో పనిచేస్తూ అప్పుడప్పుడు పదీ – పరకా పంపిస్తున్నారు. కాబట్టి ఈ మాత్ర మయినా ఉంది తను, లేకపోతే చదువుకో గలిగేదా తను? మాష్టారు చెప్పినట్లు ఖరీదైన గుడ్డలు కట్టుకుంటే తప్ప చదువుకోకూడదన్న మాట. మామూలు గుడ్డలు మురికివాసన కొడ్తాయి కాబోలు!" అనుకుంది సీతాలు. సీతాలు అలా ఆలోచనల్లో పడి కొట్టుకుంటుండగా ఎవరిదో పిలుపు వినిపించింది. "ఏం సీతా! ఇక్కడకూర్చున్నావ్? క్లాసుకుపోలేదా?" అన్న తెలుగు మాష్టారు రామశాస్త్రి గారి గొంతు వినగానే తల ఎత్తి చూసింది సీత. తెలుగు మాష్టారుని చూడగానే సీతకు దుఃఖం ఆగలేదు. భోరున ఏడ్చేసింది. "ఏం సీతా! ఏం జరిగింది? ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాడు రామశాస్త్రి. సీతాలు వివరంగా జరిగినదంతా చెప్పింది. సీతాలు చెప్పిన మాటలు విని నిర్ఘాంతపోయాడు రామశాస్త్రి. గొంతు పెగల్లేదు. సీతాలును ఎలా ఓదార్చాలో తెలియలేదు ఆయనకు. అలా ఆలోచిస్తూ ఉండిపోయి ఒక నిమిషం తరువాత "సరే! సీతా! నువ్వు క్లాసుకు పద, ఇప్పుడు రాబోయేది నా క్లాసేకదా?" అన్నాడు రామశాస్త్రి. "నేనుపోను మాష్టారూ అంతా ఏడిపిస్తారు." అంది సీతాలు.

"నేనిప్పుడే వస్తాను కదా! నువ్వు వెళ్ళు." అన్నాడు రామశాస్త్రి. సీతాలు అయిష్టంగా అక్కడినుండి కదలి వెళ్ళిపోయింది. రామశాస్త్రి నిట్టూర్చి ఒక సిగరెట్టు వెలిగించి ఒక దమ్ము పీల్చాడు. అసలు క్లాసుకి వెళ్ళేముందు ఒక సిగరెట్ తాగి వెళ్ళటం రామశాస్త్రి అలవాటు. ఆ అలవాటు ప్రకారం తోటలోకి వచ్చాడు. అక్కడ సీత చెప్పింది విన్నాడు. సీత చెప్పిన విషయం తలుచుకుంటే ఎంతో బాధ అనిపించింది. ఆ పైన సిగరెట్టు తాగాలనిపించక సిగరెట్టు ఆర్పేసి ప్రక్కకు విసిరిపారేశాడు. నోరు కడుక్కొని స్టాఫ్‌రూంకువచ్చి పుస్తకాలుతీసుకొని క్లాసుకువెళ్ళాడు రామశాస్త్రి. రామశాస్త్రి క్లాసుకు వెళ్ళేసరికి "మళ్ళీ తయారయింది మురికి దెయ్యం!" అని ఒకరంటున్నారు. "దెష్టాదేవి!" అని మరొకరు అంటుంటే అంతా పగలబడి నవ్వుతున్నారు. క్లాసులో అడుగు పెట్టిన రామశాస్త్రిని చూసి అందరి గొంతులూ మూగపోయాయి. రామశాస్త్రి టేబుల్ దగ్గర నిలబడి "ఎవరు దెష్టాదేవి?" అని ప్రశ్నించాడు. ఎవరూ మాట్లాడలేదు. క్లాసంతా ఒకసారి కలయ చూశాడు రామశాస్త్రి. ఓ మూల ఒదిగిపోయి నిలబడి ఉంది సీతాలు.

"సీతా! ఏం అక్కడ నిలబడ్డావ్?

కూర్చో!" అన్నాడు రామశాస్త్రి. సీత తల వంచుకొని చివరి బెంచీలో ఒక మూల కూర్చుంది. అంతవరకూ ఆ బెంచీలో కూర్చున్న ఇద్దరు అమ్మాయిలు లేచి ముందు బెంచీల్లో సర్దుకున్నారు. రామశాస్త్రి ఒకసారి తీక్షణంగా క్లాసువంక చూసి "సీతా! ఇలారా! ముందుకు వచ్చి మొదటి బెంచీలో కూర్చో. తెలివిగలవాళ్ళు ముందు బెంచీలో కూర్చోవాలి. నువ్వు క్లాసు ఫస్టుకదా! నువ్వే ముందు కూర్చోవాలి. నీ ప్రక్కన బేబీ! ఆ ప్రక్కన రాణి, వాణి ఇలా వరుసగా కూర్చోవాలి. తెలివి తక్కువవాళ్ళు ఎక్కడకూర్చున్నా ఒకటే! రా! ఇలా వచ్చి బేబీ ప్రక్కన కూర్చో." అన్నాడు సీతాలు రాలేదు.

"ఏం రమ్మంటే రావేం?" అని గద్దించాడు రామశాస్త్రి. సీతాలు భయం భయంగా వెళ్ళి బేబీప్రక్కన కూర్చుంది. సీతాలు ప్రక్కన కూర్చోగానే బేబీ దిగ్గునలేచి నిలబడింది. "ఏం?" అన్నట్లు ఆమెవంక చూశాడు రామశాస్త్రి.

"సార్! అది ఇక్కడ కూర్చుంటే నేను క్లాసులో ఉండను సార్!పోతాను." అంది బేబీ.

"ఏం? ఎందుకు కూర్చోవు క్లాసులో?" అన్నాడు రామశాస్త్రి.

"అది మురిగ్గా ఉందిసార్! దాని ప్రక్కన కూర్చుంటే రోగాలు వస్తాయి సార్!" అంది బేబీ తొణకకుండా.

"ఆహా! అలా అని ఎవరు చెప్పారు?" అన్నాడు రామశాస్త్రి.

"మా డాడీ! సార్!" అంది గర్వంగా బేబీ.

"సీతాలు మురికిగా ఉందని నీ కెలా తెల్సు? బట్టలు వాసన చూశావా?" అని అడిగాడు రామశాస్త్రి.

"బట్టలే కాదుసార్! దాని జుత్తు ఎలా ఉందో చూడండి సార్ మురికిగా అందుకే అదంటే నాకు రోత." అంది బేబీ గర్వంగా.

"ఓహో! అలానా! మరి నీ జుత్తు ఎలా వుంది? నీ జుత్తుకు సంస్కారం జరిగి ఎన్ని యుగాలయింది? లేక అది ఫేషను అనుకుంటున్నావా? మరి నీ ప్రక్కన కూర్చుంటే వాళ్ళందరికీ రోగాలు రావా? ఇందాకటి నుండీ చూసున్నాను. అదీ! ఇదీ! అంటున్నావ్! సీతాలుకంటే ఏ విషయంలో నువ్వు గొప్ప. సీతాలూ-నువ్వూ ఒకటే క్లాసు. నీకంటే సీతాలుకే ఎక్కువ మార్కులొస్తాయి అన్నింటిలో! ఇహపోతే నీ జుత్తు ఎంత శుభ్రంగా ఉందో నీకు తెల్సు, వాళ్ళందరికీ తెల్సు. సాటి విద్యార్థినిని అలా అవమానించడానికి మీకు సిగ్గు వేయడంలేదా? నీవు పెద్ద ధనవంతుల బిడ్డవయితే మీ వాళ్ళకు గొప్ప. ఇక్కడ అంతా సమానమే. మురికిని మనం సహించకూడదు. బాహ్యంగా ఉన్న మురికి కడుక్కుంటే పోతుంది. మనస్సులో పేరుకుపోయిన మురికి ఒక అంతట పోదు. ముందు మీ మనస్సులను ఉతుక్కోండి. నువ్వు మురికి! మురికి! అంటున్నది గుడ్డల్ని కాదు, సీతాలు పేదరికాన్ని. పేదరికం అంటే నీకు అసహ్యం కాబట్టి సీతాల్ని నువ్వు అసహ్యించుకుంటున్నావు. అది నీ తప్పుకాదు, నీ చుట్టూ ఉన్న ధనానిది-

# గౌరవంగా తప్పుకోండి

– మెంటమ్ కవిరాజ్

యుద్ధభేరి మ్రోగించ
సన్నద్ధమై పొరలివచ్చే
శ్రమజీవుల దండును
అడ్డుకొనే శక్తి-ఎక్కడుంది?
ఎవరికుంది??

ఆవేశంగా
ఆకాశంలోకి అగ్నిశిఖలై
లేస్తున్న హస్తాలతో
నేస్తం పట్టే అవకాశం ఇక లేదు
గౌరవంగా తప్పుకోండి–వాళ్ళ
హక్కుల్ని స్వేచ్ఛగాఅనుభవించనీయండి

---

ఆ సమాజానిది. ఇదే మీకు ఆఖరిసారిగా చెప్పడం. సాటి మనిషిని ప్రేమించండి. గౌరవించండి. గౌరవం పొందండి. ఏ ఒకరిని ఏ ఒకరు అవమానించినా, ఆ యవమానం మీ అందరిదీ!" అన్నాడు ఉద్రేకంగా రామశాస్త్రి. బేబీ నిస్సహాయంగా అందరివంకా చూసి అయిష్టంగా కూర్చుంది. అంతకు ముందే చాలా మంది ముఖాలు వాడిపోయాయి. తలలు దించుకున్నారు అంతా.

*　　　*　　　*

"ఏవండీ రామశాస్త్రిగారూ! మీరు పాఠాలు చెప్పడానికి వెళ్తున్నారా? సంఘ సంస్కరణకు వెళుతున్నారా క్లాసులికి? పనికిమాలిన అమ్మాయి నెవరినో వెనకేసుకొచ్చి మన డాక్టరుగారి అమ్మాయి బేబీని, ఇంకా రాణీ–వాణీలను అవమానించారట. ఇదేమయినా బాగుందా? డాక్టరుగారు తలచుకుంటే మీ బ్రతుకు ఏమవుతుందో తెల్సా. మీరు నానా మాటలు అని అవమానించారని బేబమ్మ అన్నం తినకుండా పండుకుందట. వాళ్ళ నాన్నగారి విషయం మీకు తెలుసుకదా! ఈ విషయం తెలుసుకొని ఆయన ఉగ్రుడై పైకి రిపోర్టు చేస్తానంటూ నా దగ్గరకు వచ్చి ఒకటే చిందులు! ఏదో ఈసారికి ఎలాగో సర్దిచెప్పాను. మరోసారి ఇలా జరగడానికి వీల్లేదు తెల్సిందా! మీ పని మీరు చేసుకోండి. అనవసర వ్యాపకాల జోలి మీ కెందుకు? వెళ్ళండి." అన్నాడు హెడ్మాష్టరు వాసుదేవరావు కోపంతో చిందులువేస్తూ. రామశాస్త్రి ముఖం కందగడ్డ అయిపోయింది. ఒక మాట కూడా మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండా తరిమేస్తున్న హెడ్మాష్టరును కోపంగా, విరాగ్గా–వింతగా చూసి బయటకు వచ్చాడు. మెల్లగా తోటలోకి నడిచి సిగరెట్టు ముట్టించాడు.

"ఆహా! ఇదా మన ప్రగతి? చదువుకున్న వీళ్ళ మనసులే ఇంత అపరిశుభ్రంగా ఉంటే లోకం తెలియని ఆ పసివాళ్ళ మాటేమిటి? ఇలాంటి వారి శిక్షణలో ఉంటే వాళ్ళ భవిష్యత్తేమిటి? ఈ అపరిశుభ్రాన్ని కృష్ణాన్ని పోగొట్టడం ఎలా అనుకొని బాధగా నిట్టూర్చాడు.